సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 26 । జనవరి । 2023



మనం ఆదర్శంగా ఉండాలి

ఓటుహక్కు వినియోగంలో భద్రాద్రి జిల్లా అందరికీ ఆదర్శంగా ఉండాలని కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ సూచించారు. 8లో



ఆర్టీసీ అధికారుల తిరకాసు

ఆదాయం వచ్చే రూట్లకు బస్సులు నడపాలని యాజమాన్యం చెబుతుంటే 'గూడెం' అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
34° / 17

వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు కొంత అధికంగానే ఉంటాయి. రాత్రి పూట మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రి కేటీఆర్‌ను కలిసిన పువ్వాడ



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారకరామారావు దావోస్ పర్యటన ముగించుకుని వచ్చిన సందర్భంగా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆయనను గురువారం హైదరాబాద్‌లో కలిశా రు. దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు సాధించడంపై శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ సభ విజయవంతం కావడంపై పువ్వాడను కేటీఆర్ అభినందించారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

సింగరేణి(కొత్తగూడెం): గణతంత్ర వేడుకలకు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం ముస్తాబయింది. సింగరేణి కార్పొరేట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలకు అధికారులు బుధవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తమ కార్మికులను సన్మానించడంతోపాటు మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా సీఎండీ శ్రీధర్ హాజరుకానున్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని వేడుకలను ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు.

వ్యక్తిత్వ నిర్మాణంతో ఉన్నత స్థాయికి ఎదగాలి

బూర్గంపాడు: విద్యార్థులు వ్యక్తిత్వ నిర్మాణంతో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. క్రమశిక్షణ, ఉత్తమ నడవడిక తో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. గోదావరి వరదలతో కళాశాలలో ఫర్నిచర్, ఇతర సామగ్రి దెబ్బతినగా, దాతల సహకారంతో మళ్లీ సమకూర్చుకున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించారు. ప్రిన్సిపాల్ చిన్నా, ఎస్ శేషు, ఎండీ ఖుర్షీద్, గరుడాచలం, పీబీ నిరంజన్, నందికొండ వెంకన్న, బండి వెంకటేశ్వర్లు, బోగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భద్రాచలం ఏఎస్పీ రోహిత్‌రాజ్ బదిలీ

భద్రాచలం అర్బన్: భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్ బదిలీ అయ్యారు. రాష్ట్రంలోని పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా రోహిత్‌రాజ్‌ను గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ చేశారు. ఇక ఖమ్మం అడిషినల్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న శబరీష్ శబరీష్ హైదరాబాద్ సిటీ(క్రైం) డీసీపీగా బదిలీ అయ్యారు.

తొలిసారి తిరంగా..

ఐడీఓసీలో మొదటి గణతంత్ర వేడుకలు

- రిపబ్లిక్ డే వేడుకలకు సిద్ధమైన కార్యాలయం
- నేడు ఉదయం 10 గంటలకు జెండా ఆవిష్కరణ
- సమీకృత కలెక్టరేట్‌లో రెండు వారాల్లోనే రెండుసార్లు సంబరాలు

కొత్తగూడెం అర్బన్: గణతంత్ర వేడుకలకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం సిద్ధమైంది. గురువారం ఉదయం ఐడీఓసీ ఎదుట కలెక్టర్ అనుదీప్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వేరుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా ఏర్పడిన తర్వాత 2017 జనవరి 26న తొలిసారి గణతంత్ర దిన వేడుకలకు కొత్తగూడెం వేదికైంది. పట్టణం నడిబొడ్డున కొత్తగా అభివృద్ధి చేసిన ప్రగతి మైదాన్‌లో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహిస్తూ వచ్చారు. జెండా ఆవిష్కరణతో పాటు పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శనలు అక్కడే జరిగేవి. అయితే ఈ ఏడాది గణతంత్ర వేడుకలను పరేడ్ మైదానాల్లో కాకుండా జిల్లా సమీకృత భవనాల సముదాయాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఉదయం 10 గంటలకు

ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి ఇటీవల సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన జిల్లా కార్యాలయాల సమీకృత భవనం (ఐడీఓసీ)లో బుధవారం ఉదయం నుంచి రిపబ్లిక్‌డే వేడుకల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురువారం ఐడీఓసీ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు కలెక్టర్ అనుదీప్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 9 గంటలకు హాజరు కావాలని డీఆర్ఓ అశోక్‌చక్రవర్తి తెలిపారు.



ఐడీఓసీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

గతానికి భిన్నంగా..

గత సంప్రదాయం ప్రకారం ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా వస్తుండగా, గణతంత్ర వేడుకలకు కలెక్టర్ చీఫ్ గెస్ట్‌గా వ్యవహరిస్తూ జాతీయ పతాకాలు ఆవిష్కరిస్తారు. అయితే ఈ రెండు వేడుకలు పరేడ్ గ్రౌండ్‌లోనే జరుగుతుంటాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆగస్టు 15 వేడుకల తీరులో మార్పులు తీసుకొచ్చారు. దీని ప్రకారం గతంలో సీఎం కేసీఆర్ గోల్కొండలో రాష్ట్ర స్థాయి వేడుకలు జరపగా వరంగల్ లాంటి జిల్లాలో కాకతీయులు ఏలిన ఖిల్లాలో త్రివర్ణ పతాకం ఆవిష్కరించే కొత్త సంప్రదాయానికి తెర తీశారు. కానీ గణతంత్ర వేడుకల నిర్వహణలో ఎటువంటి మార్పులు చేయలేదు. ఈసారి గతానికి భిన్నంగా గణతంత్ర వేడుకలను పరేడ్ మైదానాల్లో కాకుండా కలెక్టరేట్ (ఐడీఓసీ)ల వద్ద నిర్వహించాలని నిర్ణయించారు.

రెండు వారాల వ్యవధిలో

జనవరి 12న సీఎం కేసీఆర్ ఐడీఓసీ భవనాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఒక్కొక్కటిగా పలు జిల్లా కార్యాలయాలు ఇక్కడికి తరలిస్తున్నారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే గణతంత్ర వేడుకల నిర్వహణకు ఈ కార్యాలయం వేదికగా మారింది. రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన మిగిలిన ఐడీఓసీలతో పోల్చితే భద్రాద్రి కొత్తగూడెం కార్యాలయం చూడటానికి రాజభవనంలా కనిపిస్తోందనే భావన సర్వత్రా నెలకొంది. ఇలాంటి తరుణంలో ఎత్తయిన గుట్టమీద ఉన్న నూతన భవనం ఎదురుగా మువ్వన్నెల జెండా రెపరెపలాడనుంది.

రెండోరోజూ జేఈఈ ప్రశాంతం

సుజాతనగర్: మండల పరిధిలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో రెండో రోజు బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్‌లో 92 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 89 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 92 మంది విద్యార్థులకు అందరూ హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. 28న మళ్లీ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

అదిగో భద్రాద్రి.. గౌతమి..

- భక్త రామదాసుకు ఘనంగా స్వరాంజలి
- కంచర్ల గోపన్న జయంత్యుత్సవాలు ప్రారంభం
- రూ.10 లక్షలతో శ్రీ రామదాసు పీఠం ఏర్పాటు

భద్రాచలం: 'అదిగో భద్రాద్రి.. గౌతమి ఇదిగో చూడండి'.. , తక్కువేమి మనకూ రాముడొక్కండుడు వరకు' అంటూ సంగీత కళాకారులు భక్త రామదాసుకు స్వర నీరాజనం సమర్పించారు. భద్రాద్రి రామయ్యకు అపర భక్తాగ్రేసరుడు, వాగ్గేయకారుడు, దాశరథి శతక కర్త, భద్రాచలం ఆలయ నిర్మాత అయిన భక్త రామదాసు 390వ జయంతి ఉత్సవాలు బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలతో భద్రగిరి స్వర సాగరంలో ఓలలాడింది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, చక్ర సిమెంట్స్ వారి నేంద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్, నాదసుధ తరంగిణి కల్చరల్ ట్రస్ట్, నామగాన లహరి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి.

నగర సంకీర్తన, అభిషేకం..

భక్త రామదాసు జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని తొలుత ఆలయ ప్రాంగణంలో ఉన్న రామదాసు విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేసి, నూతన వస్త్రాలు సమర్పించారు. రామదాసు ప్రతిమతో ఆలయ ఈఓ శివాజీ ఆధ్వర్యంలో ఆస్థాన విద్వాంసులు గిరి ప్రదక్షిణ చేశారు. ఉత్తర ద్వారం వద్ద ఉన్న రామదాసు విగ్రహానికి పూలమాలలు వేసిన తర్వాత.. పవిత్ర గోదావరి మాతకు పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. ఆలయ ఈఓ శివాజీ, చక్ర సిమెంట్స్ అధినేత నేంద్రగంటి కృష్ణమోహన్ జ్యోతిప్రజ్వలన చేసి సంగీత కార్యక్రమాలను ప్రారంభించారు.



కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు

నవరత్న ఘోష్ఠితో స్వర నీరాజనం..

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు ఆలపించిన 'నవరత్న ఘోష్ఠి'తో భక్త రామదాసుకు స్వర నీరాజనం సమర్పించారు. రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలతో చిత్రకూట మండపంలో సంగీత సౌరభాలు విరబూశాయి. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు, అతని కుమారులు మల్లాది శ్రీరామ్‌కుమార్, రవికుమార్ ఆలపించిన సంకీర్తనలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా మల్లాది రవికుమార్ రచించిన ఆదిభట్ల నారాయణదాసు కీర్తనల పుస్తకాన్ని ఈఓ శివాజీ ఆవిష్కరించారు.



గోదావరి మాతకు వస్త్రాలు సమర్పించి పూజలు చేస్తున్న అర్చకులు

త్వరలో రామదాసు పీఠం..

భక్త రామదాసు రచించిన కీర్తనలను విశ్వవ్యాప్తం చేసేందుకు గాను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, నేంద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'భద్రాచల శ్రీ రామదాసు పీఠం' ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ శివాజీ వెల్లడించారు. ఇందుకోసం దేవస్థానం నుంచి రూ.5లక్షలు, ట్రస్ట్ నుంచి రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ పీఠం ద్వారా ఉగాది, శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేకంలో కీర్తనలకు సంబంధించిన సీడీలను విడుదల చేస్తున్నట్లు వైదిక కమిటీ సభ్యులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు వివరించారు. దీంతో పాటు సంగీత కళాశాల ఏర్పాటుకు కూడా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలశాయి, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 11న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్

కొత్తగూడెంటౌన్: ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర్‌ప్రసాద్ తెలిపారు. జిల్లా కోర్టులో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని కోరారు. రాజీ కాదలచిన, మనోవర్తి, చెక్ బౌన్స్, మోటార్ వాహన ప్రమాదాలు, బ్యాంకు కేసులు, కుటుంబ సంబంధ వివాదాలను పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. రాజీకి అవకాశం ఉన్న కేసుల జాబితాను స్టేషన్ల వారీగా సిద్ధం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో మొదటి అదనపు సెషన్స్ జడ్జి ఎం.శ్యాంశ్రీ, జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ సెక్రటరీ జి.భానుమతి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆడెపు నీరజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి, ఎస్పీ డాక్టర్ వినీత్, భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు డీఎస్పీలు వెంకటేశ్వర్‌బాబు, సత్యనారాయణ, టి.సత్యనారాయణ, రమణమూర్తి, డీసీఆర్‌బీ డీఎస్పీ నందిరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తానా ఆన్‌లైన్ సమావేశాల్లో 'పేట' వాసికి అవకాశం

అశ్వారావుపేటరూరల్: ఆజాదికా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్(తానా) నిర్వహిస్తున్న సాహిత్య సౌరభాలు అంతర్జాతీయ ఆన్‌లైన్ సమావేశాల్లో ప్రసంగించేందుకు అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులకు అవకాశం దక్కింది. ఈ నెల 29న జరిగే ఆన్‌లైన్ సమావేశంలో మాట్లాడాలని ఆయనకు బుధవారం సమాచారం అందింది. ప్రపంచ సాహిత్య వేదికపై 50కి పైగా సాహిత్య ప్రక్రియలు పరిచయం చేయడం ఇదే తొలిసారి. ఇలాంటి వేదికలో తనకు అవకాశం రావడం అదృష్టమని ప్రభాకరాచార్యులు చెప్పారు.

క్లుప్తంగా

బాలిక అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: బాలిక అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఈ నెల 23న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేదు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గురుకుల విద్యార్థిని ఆచూకీ లభ్యం

పాల్వంచ రూరల్: మండలంలోని ఇందిరానగర్ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల, పాఠశాల ప్రహరీ దూకి వెళ్లిపోయిన విద్యార్థిని ఆచూకీ లభ్యమైంది. పదో తరగతి చదువుతున్న కరకగూడెం మండలం రేగళ్లకు చెందిన బాలిక సోమవారం తెల్లవారుజామున ప్రహరీ దూకి వెళ్లిపోగా, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చేపట్టారు. ఈమేరకు ఆమె సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లుగా అక్కడి రైల్వే పోలీసులు బుధవారం గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఆమెతో మాట్లాడారు. దీంతో బాలికను తీసుకొచ్చేందుకు పీఈటీ, పోలీసు సిబ్బంది వెళ్లారని ప్రిన్సిపాల్ స్వరూపారాణి తెలిపారు. మూడు రోజుల అనంతరం బాలిక ఆచూకీ తెలియడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఊపిరి పీల్చుకున్నారు. ఆమెను తీసుకొచ్చాక గురుకులం నుంచి ఎందుకు వెళ్లిపోయిందనే వివరాలు తెలియనున్నాయి.

చోరీపై దర్యాప్తు



మొండికుంటలో విచారణ చేస్తున్న పోలీసులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు పుస్తెల తాడు చోరీ చేశారు. ఈ ఘటనపై అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు జితేందర్, నాగుల్ మీరా దర్యాప్తు చేపట్టారు. బుధవారం చోరీ జరిగిన ప్రాంతంలో ఐటీవిభాగం, పోలీస్ సిబ్బంది విచారణ నిర్వహించారు. మంగళవారం రాత్రి మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

గంజాయి కేసులో నలుగురికి జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: గంజాయిని అక్రమంగా తరలించిన ఘటనలో నలుగురు యువకులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ బుధవారం కొత్తగూడెం అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. వివరాలు ఇలా.. 2022, ఆగస్టు 8న భద్రాచలంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన నాగి అజయ్‌సింగ్, జొన్నలగడ్డ మణిరత్నం, విశ్వనాథం నాగరాజు, రేలా సాయిగిరీష్ కారులో 10 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసిన అధికారులు కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. ఐదుగురు సాక్షులను విచారించి, వాదోపవాదాలు విన్న తర్వాత నలుగురికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుమ్మరి రామారావు వాదించారు. లైజన్ ఆఫీసర్ హరిగోపాల్, భద్రాచలం టౌన్ కోర్టు ఏఎస్‌ఐ గంజి శశిధర్ సహకరించారు.

కుల బహిష్కరణ ఘటనపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: కుల పెద్దలు ఏర్పాటు చేసిన పంచాయితీకి రాలేదని ఓ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసిన ఘటనపై ఆలస్యంగా బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని రెడ్డిగూడేనికి చెందిన శ్రీనివాస రెడ్డిని అదే గ్రామానికి చెందిన కొందరు గత డిసెంబర్ 22న కుల పంచాయితీకి హాజరు కావాలని పిలిచారు. ఆయన వెళ్లకపోవడంతో కుల కట్టుబాటు పాటించడం లేదని కుల బహిష్కరణ చేసినట్లు అదే రోజు రాత్రి చాటింపు వేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాధ్యులైన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న ఆటో

పలువురికి తీవ్రగాయాలు

చర్ల: ఆటో అదుపు తప్పి కల్వర్టును ఢీకొని పలువురు కూలీలు గాయపడ్డ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... దుమ్ముగూడెం మండలంలోని సీతానగరానికి చెందిన వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం చర్లకు ఆటోలో వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని గోగుబాక సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెను తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆటోలో ప్రయాణిస్తున్న శైలు, తులశమ్మ, పద్మ, లక్ష్మి, సీత, సిరివెన్నెల తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

మనం ఆదర్శంగా ఉండాలి

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్



ప్రదర్శన నిర్వహిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఇతర అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ఓటుహక్కు వినియోగంలో మన జిల్లా రాష్ట్రానికి, దేశానికి ఆదర్శంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి సూచించారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారం నిర్మించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో సైతం ప్రత్యేక క్యాంపులు నిర్వహించడంతో జిల్లాలో 10,298 మంది నూతన ఓటర్లు ఓటు హక్కు పొందారని తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో బూతుస్థాయి, సహాయ ఎన్నికల రిటర్నింగ్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కృషితోనే సత్ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. దీంతో జిల్లాకు ఎన్నికల సంఘం అవార్డు ప్రకటించిందని అన్నారు. జిల్లాలోని 1098 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో 9,14,245 మంది ఓటర్లున్నారని చెప్పారు. నూతనంగా ఓటుహక్కు పొందిన వారికి ఎన్నికల గుర్తింపు కార్డును అందచేశారు. అనంతరం ఓటుహక్కుపై పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లా, పంచాయతీరాజ్ ఈఈ సుధాకర్, సహకార అధికారి వెంకటేశ్వర్లు, ఉద్యాన అధికారి మరియన్న, మైనింగ్ అధికారి జైసింగ్, మార్కెటింగ్ అధికారి అలీం, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, డీఆర్వో అశోక్ చక్రవర్తి, ఆర్డీఓ స్వర్ణలత, తహసీల్దార్లు రామకృష్ణ, రంగాప్రసాద్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ఎంఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన బెంచ్ ప్రెస్ క్రీడాకారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం కలెక్టరేట్‌లో అభినందించారు. ఈ నెల 15 నుంచి 20 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో పట్టణానికి చెందిన సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు రెండు బంగారు పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో జిమ్ కోచ్ జీవీ రామిరెడ్డి, వెంకటకృష్ణ, గాలి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల తిరకాసు

- ఖమ్మం రూట్ అద్దె బస్సులు అన్నపురెడ్డిపల్లికి మళ్లింపు
- యజమానులు విముఖత చూపడంతో నిలిపివేత



కొత్తగూడెం బస్టాండ్‌లో అధికారులు నిలిపివేసిన బస్సులు

చుంచుపల్లి: ఆదాయం వచ్చే రూట్లకు ఆర్టీసీ బస్సులను నడపాలని ఒకవైపు యాజమాన్యం సూచిస్తుంటే కొత్తగూడెం డిపోలో అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు చెప్పిన రూట్లకు సర్వీసులను నడిపేందుకు అద్దె బస్సుల యజమానులు ముందుకు రాకపోవడంతో ఏకంగా బస్సులనే నిలిపివేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కొత్తగూడెం నుంచి రోజూ రెండు పల్లె వెలుగు బస్సులు టీఎస్28టి 1999, టీఎస్28టి 2506 రెండు ట్రిప్పుల చొప్పున ఖమ్మం రూట్‌లో తిరుగుతాయి. దీంతో ఒక్కో బస్సుకు రోజుకు సుమారు రూ.10 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. అయితే ఉన్నఫలంగా ఆర్టీసీ అధికారులు ఈ రెండు అద్దె బస్సులను కొత్తగూడెం-అన్నపురెడ్డి పల్లి రూట్‌లో తిప్పాలని ఆదేశించారు. ఇందుకు ప్రైవేటు బస్సుల యజమానులు విముఖత చూపారు. దీంతో ఆర్టీసీ అధికారులు రెండు బస్సులను అర్ధంతరంగా నిలిపివేసి డిపోకే పరిమితం చేశారని యజమానులు ఆరోపిస్తున్నారు. కొత్తగూడెం-అన్నపురెడ్డిపల్లి రూట్‌లో తక్కువ ఆదాయం వస్తుందని, మొదట టెండర్ ఖరారు చేసిన ప్రకారం ఖమ్మం రూట్‌లో మాత్రమే తమ బస్సులను తిప్పాలని యజమానులు కోరుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని పేర్కొంటున్నారు. ఈ విషయమై కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. స్కూలు పిల్లల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని అన్నపురెడ్డిపల్లి రూట్‌లకు బస్సులను మార్చామని తెలిపారు. అద్దె బస్సులను ఎటుతిప్పినా వారికి కిలోమీటర్ల విషయంలో తేడా రాకుండా చూస్తామని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం డ్రైవర్లు రాకవడంతోనే బుధవారం రెండు అద్దె బస్సులను ఆపి వేరే బస్సులను కేటాయించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



తెల్లం సారయ్య (ఫైల్)

టేకులపల్లి: చేపలు పట్టేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్‌ఐ భూక్య శ్రీనివాస్ కథనం ప్రకారం.. చింతలంక గ్రామానికి చెందిన తెల్లం సారయ్య (32), మమత దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. సారయ్య బుధవారం భార్యతో కలిసి కారుకొండ పెద్దవాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఆమె బ్రిడ్జిపైన ఉండగా భర్త చేపలు పట్టేందుకు వాగులోకి దిగాడు. చేపలు పట్టేందుకు వెళ్లిన సారయ్య ఎంతకీ రాకపోవడంతో భార్య గ్రామస్తులను పిలిపించి వాగులో వెతకగా.. విద్యుదాఘాతంతో మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అస్వస్థతతో కార్మికుడు..

బూర్గంపాడు: మండల పరిధిలోని పాత గొమ్మూరు ర్యాంపులో ఇసుక లోడింగ్ చేస్తుండగా ఓ కార్మికుడు అస్వస్థతకు గురై మృతిచెందాడు. బూర్గంపాడుకు చెందిన గోళ్ల పుల్లయ్య(55) ట్రక్కుకు ఇసుక లోడింగ్‌కు వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం లోడ్ చేస్తున్న క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని తోటి కార్మికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నర్సరీల్లో మొక్కలు పెంచాలి

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో 10 రోజుల్లో మొక్కలు పెంచడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో పట్టణ ప్రగతి కార్యక్రమాలపై మున్సిపల్ చైర్మన్లు, పట్టణ ప్రగతి ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైకుంఠ ధామాలు, క్రీడా ప్రాంగణాలు, సమీకృత మార్కెట్లు, నర్సరీల్లో మొక్కలు పెంపకం, ఇంటి పన్నులు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీల్లో పెంచిన మొక్కలనే హరిత హారం కార్యక్రమంలో నాటాలని, బయటి నుంచి కొనుగోలు చేయొద్దని స్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామచంద్ర కళాశాల మైదానంలో పార్కు ఏర్పాటు పనులను తక్షణం చేపట్టాలన్నారు. కొత్తగూడెం బస్టాండ్ నుంచి పోస్టాఫీస్ వరకు డ్రెయినేజీ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని చెప్పారు. రామవరంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ప్రహరీ నిర్మాణంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. 10 రోజుల్లో పూర్తి చేయాలని టీఎస్ఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంటింటి నుంచి వ్యర్థాల సేకరణ ప్రక్రియ నిర్వహణకు ఏజెన్సీలను ఎంపిక చేయాలని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి ఇంటి పన్ను వసూళ్లు పూర్తి చేయాలని చెప్పారు. కొత్తగూడెం, పాల్వంచలలో గ్రంథాలయ ఏర్పాటు వివరాలను మున్సిపల్ కమిషనర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్లు కాపు సీతాలక్ష్మి, డి వెంకటేశ్వర్లు, పట్టణ ప్రగతి ప్రత్యేక అధికారులు అర్జున్, డా పురందర్, అలీం, మున్సిపల్ కమిషనర్లు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల ఆందోళన

సీతమ్మ సాగర్ పనులను అడ్డుకున్న రైతులు



ఆందోళన నిర్వహిస్తున్న నిర్వాసిత రైతులు

చర్ల: సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. తమకు పరిహారం చెల్లించకుండా ప్రాజెక్ట్ నిర్మాణ పనులు చేస్తున్నారంటూ ఆగ్రహంవ్యక్తం చేశారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో బుధవారం కుదునూరులో పనులను అడ్డుకున్నారు. చర్ల మండలంలోని రాళ్లగూడెం, గోగుబాక, మామిడిగూడెం, దేవరాపల్లి, కుదునూరు, ఆర్.కొత్తగూడెం, పెద్దిపల్లి, గొమ్ముగూడెం, తేగడ, దండుపేట, కొత్తపల్లి మొగళ్లపల్లి తదితర గ్రామాల్లో ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో భాగంగా చేపట్టిన కరకట్ట నిర్మాణ పనులకు 1,475 ఎకరాల భూమిని అధికారులు గుర్తించారు. ఈ భూమికి సంబంధించి కొందరు రైతులకు పరిహారం చెల్లించకుండానే పనులు ప్రారంభించారు. దీంతో కుదునూరు గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతులకు పనులు జరుగుతున్న ప్రాంతంలో రహదారిపై బైఠాయించారు. దీంతో వాహనాలు నిలిచి, పనులు ఆగిపోయాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ బి.భరణిబాబు అక్కడకు చేరుకుని రెండు వారాల్లోగా భూ నిర్వాసితులందరికీ నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. నిర్వాసిత రైతులు సిద్ది జ్ఞానరాజు, చీకటి కిశోర్, ఎడారి త్రిమూర్తులు, మజ్జిరి శ్రీనివాసరావు, కూరపాటి వీర్రాజు, సిద్ది శిరోమణి, సిద్ది సంతోషరావు, పొడుతూరి ముత్యం, పొగళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

2.64 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

మహారాష్ట్రకు చెందిన ఇద్దరు అరెస్ట్



గంజాయి, నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు

బూర్గంపాడు: చింతూరు నుంచి ఉస్మానాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహారాష్ట్రవాసులను బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పాల్వంచ డీఎస్పీ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. బూర్గంపాడు ఎస్‌ఐ సంతోష్ సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం మోరంపల్లిబంజర వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో ఐషర్ మినీ వ్యాన్‌ను ఆపిన ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది. దీంతో పోలీసులు వెంబడించి అంజనాపురం సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వద్ద పట్టుకున్నారు. వాహనాన్ని బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి తనిఖీ చేయగా అందులో 125 ప్యాకెట్లలో 2.64 క్వింటాళ్ల గంజాయి దొరికింది. దీని విలువ సుమారు రూ.53 లక్షలు ఉంటుంది. వ్యాన్ డ్రైవర్ మహదేవ్ మోహన్ గోడ్కే, క్లీనర్ కిషన్ కాళిదాస్ పవార్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. మంగళవారం వీరితోపాటు సూత్రధారులు పప్పు మామా, సత్యజిత్ కూడా కారు, మినీ వ్యాన్‌లో చింతూరు వెళ్లారు. అక్కడ మినీ వ్యాన్‌లో గంజాయి ప్యాకెట్లు పెట్టుకుని మహారాష్ట్రకు బయలుదేరారు. పప్పు మామా, సత్యజిత్ కారులో వెళ్లిపోగా, లారీ డ్రైవర్, క్లీనర్‌లు మినీ వ్యాన్‌లో వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వ్యాన్ యజమాని అభిరాం పవార్‌పై కూడా కేసు నమోదు చేశామని, కారులో పరారైన పప్పు మామా, సత్యజిత్‌ల కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. డ్రైవర్, క్లీనర్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్వంచ సీఐ నాగరాజు, ఎస్‌ఐలు సంతోష్, రమణారెడ్డి, ఏసుబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



శ్యాంకుమార్ మృతదేహం

చంద్రుగొండ : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెంది సంఘటన చంద్రుగొండ హనుమాన్‌బజార్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ కృష్ణారావు కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని బోడగుట్ట సమీపంలోని శేషగిరినగర్‌కు చెందిన మాళోత్ శ్యాం కుమార్ అలియాస్ శ్యాం (32), రూప 16 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నారు. కొన్నేళ్ళ క్రితం చంద్రుగొండకు వచ్చి కూలి పనులు చేసుకుంటూ హనుమాన్‌బజార్‌లో జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం కూడా గొడవ జరిగింది. దీంతో పిల్ల లను తీసుకుని బయటకు వెళ్లిన రూప తెల్లవారుజామున మళ్లీ ఇంటికి వచ్చింది. అప్పటికే శ్యాం అపస్మారక స్థితిలో ఉండగా, 108 అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పాల్వంచ: స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని వికలాంగుల కాలనీలో ఓ స్థలం వివాదం కొన్నేళ్లుగా నడుస్తోంది. ఈ క్రమంలో బుధవారం మరోసారి ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలు గడ్డపారలు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో నరేందర్ అనే వ్యక్తికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌ఐ నరేష్ ప్రాథమిక విచారణ నిర్వహించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు 'సోలార్'

- స్త్రీనిధి నుంచి బ్యాంక్ రుణంతో ఏర్పాటు
- ఖమ్మం జిల్లాలో ఆరు మండలాలు, మూడు గ్రూపులకు అవకాశం
- మండలానికి 35 మంది చొప్పున లబ్ధిదారుల ఎంపిక



టీఎస్ రెడ్‌కో, స్త్రీనిధి అధికారులతో చర్చిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి(టీఎస్ రెడ్‌కో) ఆధ్వర్యాన మహిళా సంఘాల సభ్యులకు సోలార్ యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంధన పొదుపులో భాగంగా మహిళా సంఘాలను భాగస్వాములను చేసేందుకు సబ్సిడీపై స్త్రీనిధి రుణంతో యూనిట్లు అందించనున్నారు. ఈ యూనిట్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ గృహావసరాలకు పోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్లకు విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తారు. బ్యాంకు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తున్న ఎస్‌హెచ్‌జీలను ఈ యూనిట్లకు అర్హులుగా ఎంపిక చేయనున్నారు. ఇలా జిల్లాలో ఆరు మండలాలు, మూడు మెప్మా గ్రూపులను సోలార్ యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం ఎంపిక చేసి ఉత్తర్వులు జారీ చేసింది.

అనుకొల్లును ఆదర్శంగా తీసుకుని..

సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిజామాబాద్ జిల్లాలోని అనుకొల్లులో వంద శాతం మహిళా సంఘాల సభ్యులు టీఎస్ రెడ్‌కో ద్వారా సౌర విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వం అన్ని జిల్లాల్లో కొన్నేసి మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు ఖమ్మం జిల్లాలో చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ, సత్తుపల్లి రూరల్, ఖమ్మం రూరల్, కొణిజర్ల మండలాలతో పాటు మెప్మా ఆధ్వర్యంలోని సత్తుపల్లి ప్రియదర్శిని సంఘం, మధిర సరస్వతి సంఘం, ఖమ్మం కస్తూరి సంఘాలను ఎంపిక చేసింది. ఒక్కో మండలంలో 35 మహిళా సంఘాలకు, మెప్మాలోని సంఘాలకు 35 చొప్పున యూనిట్లు మంజూరు చేస్తారు.

వీరికే అవకాశం..

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు బ్యాంక్ లింకేజీ ద్వారా తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించడంతో పాటు విద్యుత్ వినియోగం 200 యూనిట్ల నుంచి 300 యూనిట్లకు పైగా ఉంటే సోలార్ యూనిట్లు మంజూరు చేస్తారు. ప్రభుత్వం ఎంపిక చేసిన మండలాల్లో ఉత్తమ స్వయం సహాయక సంఘాలను గుర్తించి వారిలో అర్హులైన సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. స్త్రీనిధి సిబ్బంది, టీఎస్ రెడ్‌కో అధికారులు ఈ యూనిట్ల ఏర్పాటును సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా, సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్న సభ్యులు తమ కుటుంబ అవసరాలు పోగా మిగులు విద్యుత్‌ను నెట్ మీటర్ ద్వారా గ్రిడ్లకు విక్రయించే అవకాశం కల్పిస్తారు. ఈమేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి విద్యాచందన ఆధ్వర్యాన టీఎస్ రెడ్‌కో డీఎం ఉమాకాంత్, స్త్రీనిధి ఆర్ఎం రవీంద్రనాయక్ బుధవారం ఖమ్మంలో సమావేశమయ్యారు. యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక, రుణాల గ్రౌండింగ్, సబ్సిడీ, దరఖాస్తులపై చర్చించారు. ఇప్పటికే ఏయే మండలాల్లో యూనిట్లు మంజూరు చేయాలో నిర్ణయించిన నేపథ్యాన ఆసక్తి, అర్హత కలిగిన సభ్యులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు.

వైమానిక దాడుల ఇన్‌ఫార్మర్‌ను హతమార్చాం

మావోయిస్టు పార్టీ దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగా

చర్ల: జనవరి 11న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో జరిగిన వైమానిక దాడులకు పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించిన వ్యక్తిని హతమార్చామని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు పార్టీ దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగా బుధవారం లేఖ విడుదల చేశారు. బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల బొట్టెంతోగు గ్రామానికి చెందిన తాటి హిడ్మాను మూడేళ్ల క్రితం దంతెవాడ జిల్లా కేంద్రంలో పోలీసులు లొంగదీసుకుని డబ్బు ఆశ చూపి ఇన్‌ఫార్మర్‌గా మార్చుకున్నారని గంగా లేఖలో పేర్కొన్నారు. అప్పుడు 12వ తరగతి చదువుతున్న హిడ్మా దంతెవాడలోని పాఠశాలకు వెళ్లి వస్తూ మావోయిస్టు స్థావరాల సమాచారాన్ని మొబైల్ ఫోన్ ద్వారా పోలీసులకు చేరవేశాడని, ఈ క్రమంలోనే పోలీసులు తమ స్థావరాలపై వైమానిక దాడులకు దిగారని గంగా ఆరోపించారు. వైమానిక దాడుల అనంతరం తమ పార్టీ చేపట్టిన విచారణలో తాటి హిడ్మా నేరస్తుడుగా తేలడంతో ప్రజాకోర్టు నిర్వహించి అతడికి మరణ శిక్ష విధించామని తెలిపారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

సుజాతనగర్: కారు ఆటోను ఢీ కొట్టి ఘటనలో కారు డ్రైవర్‌పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచకు చెందిన రసూల్, సాధిక్, జక్రియ అనే ముగ్గురు వ్యక్తులు ఈ నెల 21న సుజాతనగర్ లోని బంధువుల ఇంటికి వచ్చారు. అదే రోజు అక్కడి నుంచి ఆటోలో తిరిగి వెళుతుండగా వేపల గడ్డ గ్రామం వద్ద కొత్తగూడెం వైపు నుంచి వస్తున్న కారు ఆటోను ఢీ కొట్టింది. ఈ క్రమంలో ఆటోలో ఉన్న వ్యక్తులకు గాయాలయ్యాయి. రసూల్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఫిరోజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.